# కనపడని ఖర్చు

రచన:

శ్రీ ఓగేటి శివరామకృష్ణ

★

మా యింట్లో కూర్చుని పేకాడుతూ యుంటే...హఠాత్తుగా మా సంభాషణ..."మా బృందంలో డబ్బు దూబరగా ఖర్చుచేసే ఘనుడూ, దమ్మిడీ ఖర్చుపెట్టడానికి వెనుకాడే నిర్భాగ్యుడూ యెవరయ్యా" వరకూ దారితీసింది—

డబ్బు దూబరగా ఖర్చుపెట్టే వారిలో ప్రథమస్థానం నాకే యిచ్చారు. సంతోషం...న్యాయంగా ఆలోచించినందుకు...,

"ఇక డబ్బు జాగర్తగా వాడేవరా?" అన్న ప్రశ్నకు మావాళ్లంతా పకపకా నవ్వుతూ కోటీశ్వరరావు వైపు చూశారు. నేనూ మావాళ్ల ననుసరించా.

ఆ మాటకు కోటీశ్వరరావుకు కోపంవచ్చినా, ముఖం చిన్న బుచ్చుకొని-

"మీరంతా అలాగనుకొంటూ యుంటారు...నే ఖర్చుపెట్టే డబ్బు యెవరు ఖర్చుపెడ్తున్నారా?" అని అన్నాడు.

"ఆ ఖర్చు పెట్టావ్ లే—పదిమందికి పెట్టడం-యివ్వటం మాట అటుంచి నువ్వు తృప్తిగా తినియేడిశావా యెప్పుడైనా?" ఒకసారి కాఫీహోటలుకు తీసుకు వెళ్ళావ్ జ్ఞాపకముందా. మేమంతా తలో రూపాయి నీ చేత తగలవేయించినా...నీ మట్టుకు కాఫీ నీళ్ళతోనే సంతృప్తిపడి ఊరుకొన్నావు! అని నరసింహారావు అన్నాడు.

"అవును మొన్ననూ అంతే...అంతా కలసి...పాండవోద్యోగ విజయాలు. డ్రామాకు రిజర్వుడు టిక్కెట్లు కొంటూంటే...ముప్పది యెకరాల పొలం ముడ్డివెనక్కాల పెట్టుకొని...డ్రామాకు...రావటానికి అఘోరించి అఘోరించి కుర్చీ టిక్కెట్టు తీసుకో పొయ్యాడు. అప్పుడు...మిగిలిన స్వంత డబ్బు నేనేసి రిజర్వుడు తీయించా" అంటూ వెళ్లగక్కాడు తనకు మిగిలిన డబ్బు లివ్వలేదని చెప్పటంకోసం నారాయణరావు.

"అంతదూరం పోతారెందుకట్టా. మనకు పెట్టడు...తాను తినడు...పోనీ...యింట్లో సుఖంగా తిని...ఆనందంగా కాలక్షేపం చేస్తాడా అంటే అదీకాదు. ముప్పది యెకరాలు ఆముసలాడు యిచ్చి వెళ్లి పోయాడుకదా...శుభ్రంగా యితరులకు పెట్టకపోయినా...తాను తింటే యేమడ్డువచ్చింది." ఇంట్లో ముచ్చటగా ముగ్గురు పిల్లలున్నారు కదా...వాళ్లకోసం...డబ్బున్న అతనిబోటివాళ్లు యెంతఖర్చు పెట్టవచ్చు.

మొన్న సంవత్సరం దీపావళికి ముగ్గురు పిల్లలకూ మూడు రూపాయల సరుకు...కొని తీసుకువచ్చాడు..."అవేమిటోయ్...అల్లా...డబ్బున్న నువ్వే తెచ్చావంటే...ఇంట్లో కాల్చేవాళ్ళెవరున్నారోయ్...మా పెద్దాడూ...చిన్నాడూ వాటిదరికి వెళ్లనన్నారు...ఇవన్నీ మా లక్ష్మి కోసం! అంటూ వెళ్ళగక్కాడు...ఎల్లాగయినా...కోటీశ్వరరావు...పిసినిగొట్టు...చేత్తో డబ్బుఖర్చు పెట్టడానికి యిష్టపడడు" అంటూ గోపాలం తన యుద్దేశం బయటపెట్టాడు.

—ఇల్లా అంతా తలో మాటా అంటూంటే కోటీశ్వరరావు నిశ్చేష్టుడయ్యాడు 'నేను మీ అందరికంటే హెచ్చు ఖర్చుపెడతా...నా సంగతి మీకు తెలియదు. నాది తెలియని ఖర్చు. కాని మీరు నన్ని పిసినిగొట్టు అని అంటున్నారు.'

"పోనీలే! అప్పుడే అంతగా నువ్వు నొచ్చుకొనటం యెందుకూ? నీవు డబ్బు ఖర్చుపెట్టకపోతే నీదగ్గరే యుంటుంది...వాళ్ళేదో అంటారు..." అని నే సామరస్యపు మాటలన్నా...పేకముక్కలు కలిపివేస్తూ...ఆనాడు మా ఆట అలా విచారాంతంగా పూర్తయింది. కోటీశ్వరరావు లోపల బాధపడుతూ యింటికి వెళ్లిపోయాడు...

కోటీశ్వరరావు...మా స్నేహితుల జట్టులోనికి ఉన్నవాడు...అతడు...తానింత తిని యితరులకు యింత పెట్టగల శక్తి కలవాడూ, అంతా...యేదో పెద్దడబ్బు నిలవేశారని తలుస్తూ యుండేవాళ్ళం. కోటీశ్వరరావు పొదుపుమాటలు చూచి నిజమే...యితడు డబ్బు జాగర్తచేసి ఉంచి ఉంటాడనుకొనే వాళ్ళం. కాని కోటీశ్వరుడు మాత్రం! "నా దగ్గర యెప్పటికప్పుడే ఖర్చయిపోతుందురా...చిల్లుకాని అయినా నిల్వ ఉండదు" అంటూ యుంటాడు...

ఒకదినం...కోటీశ్వరు డింటికెళ్లా. కోటీశ్వరుడి భార్య రాజ్యలక్ష్మి కొద్దో గొప్పో చదువుకొన్నది...నాకా మెతో పూర్వ పరిచయం ఉండటం వల్లా 'అన్నయ్యా' అని నన్ను సంభోదిస్తూ యుంటుంది.

"అన్నయ్యా...నీ కోసం కబురు పంపుదామనుకొంటూంటే...నువ్వే వచ్చావ్...సాయంకాలానికి...ఒదినా పిల్లలూ వస్తారు. ఈరోజు భోజనం నువ్విక్కడ చేసితీరాలి.

కోటీశ్వరరావు గూడా పట్టుదల పట్టాడు..."సరే" ననవలసి వచ్చింది.

భోజనం చేస్తూంటే కోటీశ్వరరావు తిరిగి "నేయి" తీసుకొని రమ్మన్నాడు. చిన్న గిన్నెలో నేయి అయిపోటంవల్ల కాబోలు...కేరియరు తీసుకొని వంటింట్లోకి వచ్చింది రాజ్యలక్ష్మి.

మాకు వడ్డించి తాను దొడ్డిలోనికి యేదో పనివల్ల వెళ్ళి "అమ్మాయ్ లక్ష్మీ...నేతి కేరియరు యిల్లా తీసుకొనిరా అమ్మా" అంది.

కోటీశ్వరరావు వచ్చి తీసుకెళ్లు. అది 'పారవేస్తుంది' అంటున్నాడు...కాని లక్ష్మి పరుగెత్తుకొనివచ్చి...బరువు కేరియరు...తీసుకొని బయలుదేరింది.

కొంచెంకాలం గడచిం తరువాత "అయ్యో రెండువీశల పండంటి నెయ్యి...నేలపాలు చేసింది" అన్న రాజ్యలక్ష్మి మాటలు వినిపించాయి......

నే "అయ్యో" అన్నా...

లక్ష్మి...చిన్నబోతూ లోనికొచ్చింది...

"అంత నెయ్యి భూమివాల్చేసేసింది. మిమల్ని రెండువీశెలు ఒకేమారు యెవరుపుచ్చుకోమన్నారు?"అంటూ రాజ్యలక్ష్మి వచ్చి లక్ష్మిని కొట్టబోయింది...

"నెయ్యిపోటం వోటె...సాదింపులు వకటీనా?...లక్ష్మి ... "ఏడవకు" అంటూ బుజ్జగించాడు కోటీశ్వరరావు—

"భోజనాలయిన తరువాత కోటీశ్వరరావు...తన గదిలోనికి తీసికెడ్తూ...చూశావా...రెండువీశెల నెయ్యి ప్రొద్దుట పోయించుకొన్నా...చూడు...నే చుక్కయిప్పుడు చుట్టాలొస్తే...తెల్ల మొఖం వేయిస్తుంది...అంతేరా...ఎంత ఖర్చుపెట్టినా...నా ఖర్చు యీలాగే యేడుస్తూ యుంటుంది...కనపడదు...మనవాళ్ళంతా తలో విధంగా నన్నుగురించి అనుకొంటూ యుంటారు...ఉత్త పిసినిగొట్టు నంటారు...చూడు......నిరుటి సంవత్సరం పొలాలవల్ల రాబడి...పదివేలరూపాయలు...ఖర్చుచూడు. పన్నెండువేలు...రెండువేలు అప్పుచేశా...చూడు చిట్టా ఆవర్జాలకంటె ప్రమాణలున్నాయ్యా" అంటూ నా చేతికిచ్చాడు...

సజంగా పరిశీలిస్తే కోటీశ్వరరావుకున్న ఖర్చు యెవ్వరికీ ఉండదని నాకు బోధపడింది. పాపం అతడి ఖర్చు కనపడనిది. కబుర్లుమాత్రం చాలా చవకబారుగా నడుస్తూ యుంటాయి......... క్రియమాత్రం మంచి జోరుగా ఉంటుంది.

రాజ్యలక్ష్మి తన తమ్ముడు పెండ్లికెడుతూ తన తమ్ముడు భార్యా, తనకు అవబోయే మరదలుకు...సిల్కు జాకెట్లు కొంటానందిట. వాళ్ళవద్దనుంచి తాము సంపాదించుకొనటానికి బదులు యెదురువాళ్లకే పెట్టడం...తన కాశ్చర్యకరంగా కన్పించినా, భార్యకోపగించుకుంటుందేమోనని భయపడి... అయిదువందల రూపాయలతో తెమల్చవలసిన సామానుకు...ఎనిమిదివందలు తగలేసి, భార్యను సంతోషపెట్టాడట.

క్రిందటి సంవత్సరం..."తనతో...మదరాసు తీసుకొని వెళ్లి అన్నీ చూపించుతానని" రెండో కొడుకుతో చెప్పాడట. కొన్ని కారణాలవల్ల మద్రాసుకి కోటీశ్వరరావు తీసుకొని పోవకపోటంవల్ల పోయిన దసరా సెలవుల్లో మూడువందల రూపాయలతో, తెలిసీ తెలియని జ్ఞానంతో రెండోకుమారుడు ఉడాయించాడట ఎప్పుడూ యింటి గుమ్మంగూడా విడిచి యెరగకపోవటంవల్ల రాజ్యలక్ష్మి, బావురు మనటంవల్ల, వాడిని వెతకటంకోసం మరో మూడువందలు తగలేసాడు...వాడ్ని యింటికి రప్పించుకోటానికి.

మా మిత్ర బృందంలో ఒకరయిన గోపాలరావు తన అవసరంకొద్దీ కోటీశ్వరుణ్ణి అయిదువందలు అప్పడిగాడు.

అప్పటివరకూ నువ్వు డబ్బు యెవరికయినా యిస్తే ఆరిసి పోతుందని భయపడుతావు...అప్పు యివ్వడానికే భోషాణంలో డబ్బుచూచి సంతోషించడానికా అన్న గోపాలానికి యివ్వకపోతే మరీ డెప్పి పొడుస్తాడనే యుద్దేశంతో తన వద్ద లేకపోయినా, తన కష్టాలు యెలాగో గడిపి మిత్రునికి సహాయంచేసి సంతృప్తి పడదామని తలుస్తే—తానొకటి తలుస్తే దైవ మొకవిధంగా తలచినట్లయింది—

బజార్లో యేదో ఆశ్చర్యకర విషయం చూస్తుంటే జేబు కత్తిరించి యెవరో డబ్బుతో ఉడాయించాడు.

తమ యింటికి యెవరయినా చుట్టాలువస్తే, భార్య వాళ్ళను వెళ్లనివ్వదని, తన పిల్లలకంటె వాళ్ళను...అతి యిదిగా...పోషిస్తుందని—చిట్టచివరకు వచ్చినవాళ్ళే విసుగువచ్చి వెళ్లిపోతారని—వెళ్ళిపోయే సమయంలో పసి పిల్లాడినుంచి, పెద్దవయస్సు వచ్చిన మొగవ్యక్తి వరకూ, నూతన వస్త్రాలంకారణచేయటం జరుగుతూ యుంటుందిట.

ఎవరో ఒక పాతచుట్టం ఒకాయన న్నాట్ట. ఆయన యెప్పటికప్పుడు 'రేపటిదినం తప్పకయిస్తా'నని చెప్పి పాతి కాపరకా తీసుకొని వెళ్లి ఆరగించుతూ యుంటాట్ట! ఎప్పుడూ తిరిగి యిచ్చేది లేదుట.

ఈలాంటి కథలెన్నిటినో కోటీశ్వరరావు చెబుతోంటే నాకు తెలిసివచ్చింది.

తిరిగి కోటీశ్వరరావు యీలా చెప్పాడు. "వాళ్లంతా వృధా ఆలోచనలు చేస్తారు. నా దగ్గర యేదో డబ్బు నిలవ యుండి ఉంటుందని తలస్తూ యుంటారు. చూశావుగా.

నే ఖర్చులో జాగర్త చూపించలేను కాని—కబుర్లలో జాగర్త చూపిస్తా. చేసేఖర్చులు యీలా చేస్తూ యుంటా. కలుగురూ నన్ను 'పిసినిగొట్టు' అంటూయుంటారు. ఏసంగతీ తెలియకుండా వాళ్ళంటూంటే...అది ఆనందించటానికనే నే ననుకుంటూ యుంటా. కాని నాది కనపడని ఖర్చు.

---

### కొత్తరకం టీ

అమెరికాలో కొత్తరకం టీ కనిపెట్టబడింది. పొడరుతో నిండిన ఆసులపై నీళ్లు చల్లితే చాలు-అది కరిగిపోయి డికాక్షన్ పాలలో కలుపుకొని త్రాగడానికి సిద్ధమౌతుంది.





మీరు ప్రక్క-పాపిడి తీసికొన్నను, మధ్య పాపిడి తీసికొన్నను వ్రేలాడు జడ వేసికొన్నను జడ వేసికొని చుట్ట చుట్టుకొన్నను లేక ఊరకనే చుట్ట చుట్టుకొన్నను మరే విధముగా నలంకరించుకొన్నను అందమగు విస్తారమైన కురులు ముఖ్య అవసరము. కేశవర్ధిని సమృద్ధిగా అందమైన కేశములను పెంచును.

సహజ సౌందర్యము దేవుని ప్రసాదము. ఐతే కురుల అందమును కృషిచేసి మీరు కేశవర్ధిని వల్ల పొందవచ్చును.

చిన్నతనములోనే కేశముల ఆరోగ్యమునకు కురుల అందమునకు కేశవర్ధినితో పునాది వేయుడు. కేశవర్ధినీ కటాక్షములచే పెంపొందని కేశములు లేవు. ఎట్టి కురులనైనను వృద్ధిచేయును.

# కేశవర్ధిని

అందమైన కేశములను పెంచి

వాటిని గట్టిపర్చు కేశవర్ధిని కొనుడు.

కేశవర్ధిని అ. 14. కేశవర్ధిని షాంపు అ. 14.

ప్యాకింగు పోస్టేజి అధికము.

వర్తకు లందరివద్దను దొరకును, లేక

సౌత్ ఇండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.